# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 286 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | సోమవారం | నవంబర్ | 25-11-2024 | వెల : .రూ. 5.00




## మా ఇల్లు బఫర్ జోన్‌లో లేదు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్

తన ఇల్లు విషయంలో వస్తున్న వార్తలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. మధురానగర్‌లో తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఈ అంశంపై ఆయన స్పందిస్తూ.. "సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. 44 ఏండ్ల క్రితం మా నాన్న నిర్మించిన ఇంట్లోనే ఉంటున్నాం. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు దుష్ప్రచారం

-మిగతా 2 లో

# తెలంగాణ విముక్తికి మరో ఉద్యమం



- 60 ఏండ్ల స్వరాష్ట్ర పోరాటంలో చెరిగిపోని సంతకం కేసీఆర్
- 29న రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్): హైదరాబాద్

కాంగ్రెస్ కంబంధ హస్తాల నుంచి తెలంగాణను విముక్తి చేయడానికి మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరముందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివార హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అని ప్రొఫెసర్ జయశంకర్ చెప్పిన మాటలను స్ఫూర్తిగా

-మిగతా 2 లో



## నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

- అదానీపై జేపీసీ వేయాలి
- కేంద్రం వైఖరిపై ప్రధాని ప్రకటన చేయాలి
- అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్

నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్):న్యూఢిల్లీ

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అదానీ అవినీతిపై చర్చించాలి. కేంద్రం వైఖరిని ప్రధాని మోడీ ప్రకటించాలి.. ఈ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ

-మిగతా 2 లో



## 28న హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

### కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం

రాంచీ

జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ఈ నెల 28న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తాజా ఎన్నికల్లో జెఎంఎం నేతృత్వంలోని ఇండియా వేదిక ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. గవర్నర్ సంతోష్ గంగ్వార్‌ను ఆదివారం కలిసిన హేమంత్ సోరెన్ తన రాజీనామా సమర్పించారు. మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. రాజీనామాను ఆమోదించిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేవరకూ తాత్కాలిక ముఖ్యమంత్రిగా

-మిగతా 2 లో




- డిసెంబరుసెంబరు 1 నుంచి 9 వరకు.. రాష్ట్రమంతా ప్రజాపాలన విజయోత్సవాలు
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- పెద్దపల్లిలో యువతతో సీఎం రేవంత్‌రెడ్డి సభ
- గ్రూప్-4 అభ్యర్థులకు నియామక పత్రాలు
- 26 నియోజకవర్గాల్లో గురుకులాలకు శ్రీకారం
- కేబీఆర్ పార్కు చుట్టూ కూడళ్ల అభివృద్ధికీ..
- దామరచర్లలో విద్యుత్తు కేంద్రం ప్రారంభం

నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్): హైదరాబాద్,

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ వ్యాప్తంగా డిసెంబరు 1 నుంచి 9 వరకు ఘనంగా వేడుకలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఉత్సవాల్లో భాగంగా కీలకమైన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. -మిగతా 2 లో



## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

-ఏఐసీసీ అగ్ర నేతలతో సమావేశం

- మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్ పదవుల భర్తీపై చర్చించే అవకాశం

నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్):హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. సోమవారం సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎంపీలు కూడా హస్తినకు వెళుతున్నట్టు తెలిసింది. త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ జరుగుతందనే ఊహాగానాల మధ్య రేవంత్ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

-మిగతా 2 లో





## సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులు

-జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారిన ఇరువురు ఉపముఖ్యమంత్రులు

-వారు ప్రచారం చేసిన రాష్ట్రాల్లో వారి కూటముల ఘనవిజయం

-జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారిన తెలుగు నేతలు

-తెలుగు వారి సత్తాను మరోసారి విశ్వవ్యాప్తం చేసిన పవన్ కళ్యాణ్, భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):

తెలుగు రాష్ట్రాల ఉపముఖ్యమంత్రులు భట్టి విక్రమార్క, పవన్ కళ్యాణ్ జాతీయ రాజకీయాల్లో తమ శక్తి, స్ట్రాటజీ, స్పష్టతను మరోసారి నిరూపించారు. ఝార?ండ్‌లో ఇండియా కూటమి విజయానికి భట్టి విక్రమార్క కృషి కీలకంగా నిలిస్తే, మహారాష్ట్రలో ఎన్డీఏ గెలుపులో పవన్ కళ్యాణ్ మ్యాజిక్ ప్రధాన పాత్ర పోషించింది. ఈ విజయాలతో జాతీయ స్థాయిలో తెలుగు నేతల ప్రభావం మరింత బలపడింది.

**జర్ఖండ్‌లో విక్రమార్క వ్యూహం :**

జర్ఖండ్‌లో ఇండియా కూటమి తుదిదశ

-మిగతా 2 లో



## డేటా ఎంట్రీ కీలకమైనది

- డోర్ లాక్, వలసలు వారి వివరాలను సేకరించండి
- జార్ఖండ్ నుంచి కలెక్టర్లు, ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టి విక్రమార్క ఆదేశం

నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్):హైదరాబాద్

సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందనీ, డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమైందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకూడదని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన జారండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులు,కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. డేటా ఎంట్రీలో నాణ్యత చాలా ముఖ్యమైందన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కాబట్టి వారికి ఫోన్‌కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను నమోదు చేయాలని సూచించారు. వారిని అందుబాటులో

-మిగతా 2 లో

# 9 రోజులపాటు ప్రజాపాలన విజయోత్సవాలు

(మొదటి తరువాయి)

9 రోజుల పాటు జరిగే సంబరాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కీలక భూమికగా ఉండేలా కార్యాచరణను రూపొందిస్తోంది. ఈ మేరకు శాఖలవారీగా ఒకటో తేదీ నుంచి వరుసగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో సమీకృత గురుకుల పాఠశాల సముదాయాల భవనాలకు భూమి పూజ నిర్వహిస్తారు. ఇప్పటికే 28 నియోజకవర్గాల్లో ఈ భవనాల పనులు మొదలయ్యాయి. మరో 26 నియోజకవర్గాల పరిధిలో సమీకృత గురుకులాలలను ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసింది. ప్రజాపాలన విజయోత్సవాల్లో వీటికి శంకుస్థాపన చేయనున్నారు. ఒకటో తేదీ నుంచి 7 వరకు అన్ని గ్రామాల్లో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలను నిర్వహిస్తుంది. డిసెంబరు 4న పెద్దపల్లిలో యువతతో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. గ్రూప్-4 ఉద్యోగాలు సాధించిన వారికి ఈ సభలో నియామకపత్రాలను అందజేయనున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 16 కొత్త నర్సింగ్ కాలేజీలతో పాటు, 28 పారా మెడికల్ కాలేజీలను నెలకొల్పనున్నారు. వీటితో పాటు కొత్తగా 213 అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువస్తారు. ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాకో ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వీరిని వాలంటీర్లుగా నియమిస్తారు. అలాగే గోషామహల్‌లో నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనానికి భూమి పూజ చేస్తారు. ఆరంఘర్-జూపార్క్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన ఆరు మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ప్రారంభిస్తారు. కేబీఆర్ పార్కు సమీపంలో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు రూ.826 కోట్ల భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక సమీపంలో దాదాపు 106 స్టాళ్లతో ఇందిరా శక్తి మహిళా బజార్లను ప్రారంభిస్తారు. తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపనతో పాటు అటవీ పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సఫారీ థీమ్ పార్క్, బొటానికల్ గార్డెన్లను ప్రారంభిస్తారు. ఘట్‌కేసర్‌లో బాలికలకు ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే పనులు జరుగుతున్న మల్లేపల్లి, మేడ్చల్, నల్లగొండ ఏటీసీలను ప్రారంభిస్తారు. దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను జాతికి అంకితం చేస్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 237 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో తరగతులను ప్రారంభిస్తారు. కొత్తగా తలపెట్టిన స్పోర్ట్ యూనివర్సిటీకి భూమి పూజ చేస్తారు. ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏఐ సిటీ ఏర్పాట్లతో పాటు పలు ఒప్పందాలు చేసుకోనున్నారు. విజయోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. అన్ని స్థాయిల్లోని విద్యార్థులను ఈ వేడుకల్లో భాగస్వామ్యం చేసేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. శాఖల వారీగా నిర్ణీత ప్రణాళిక ప్రకారం సంబంధిత మంత్రుల సారథ్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు.. మంత్రులతో పాటు ఈ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని అధికారులకు సీఎం పిలుపునిచ్చారు.

# తెలంగాణ విముక్తికి మరో ఉద్యమం

(మొదటి తరువాయి)

తీసుకుని పోరాటాలకు సిద్ధం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని వ్యాఖ్యానించారు. "సమైక్య రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పాలనలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు చిధ్రమైన పరిస్థితి. మళ్లీ ఈ రోజు రాష్ట్రంలో ఆ పరిస్థితులు కనబడుతున్నాయి. అదే నిర్బంధం, అదే అణిచివేత, అవే దుర్భర పరిస్థితులు, ఆందోళనకరమైన వాతావరణం. నాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో నేడు మళ్లీ ఢిల్లీలోని పార్టీల మెడలు వంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తెలంగాణలో బతుకు అంధకారమైందని రైతులు, ఆటో కార్మికులు, నిర్మాణ రంగంలో ఉండే కూలీలు అట్టడుగు స్థాయి నుంచి సంపన్న వర్గాల వరకు అందరూ బాధపడుతున్నారు" అని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని కొంతమంది బీరాలు పలుకుతున్నారని విమర్శించారు. అలాంటి వారు ఒక సారి చరిత్ర పుటలను తిరగేసి చూడాలని హితవు పలికారు. "60 ఏండ్ల తెలంగాణ ఉద్యమంపై కేసీఆర్ చెరిగిపోని సంతకం చేశారు. 2009 నవంబర్ 29న దీక్ష చేపట్టారు. 'కేసీఆర్ సచ్చుడో%ౌ%తెలంగాణ వచ్చుడో' అన్న మాట దేశ రాజకీయాలను కదిలించింది. ఉద్యమంలో ఉన్న నిర్బంధాలు ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయి. వాటిని ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి" అని కేటీఆర్ పిలుపు నిచ్చారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రకటించారు. ఈ నెల 29న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో, పార్టీ కార్యాలయాల్లో దీక్షా దివస్ ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వాటిని విజయవంతం చేసేందుకు పార్టీలోని సీనియర్ నాయకులకు జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. దీక్షా దివస్ చివరి రోజు డిసెంబర్ 9న మేడ్చల్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణతో కార్యక్రమాన్ని ముగించనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలందరూ పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు.

**నిమ్స్‌లో అన్నదానం**

"మలిదశ తెలంగాణ ఉద్యమంలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర ఎంతో ఘనమైనది. నాడు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలించడం జరిగింది. దీక్ష ముగిసే వరకు ఉద్యమానికి కేరాఫ్‌గా నిమ్స్ నిలిచింది. స్వరాష్ట్ర ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన పాత జ్ఞాపకాలను స్ఫూర్తిగా తీసుకుంటూ నవంబర్ 29న నిమ్స్ ఆస్పత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తాం. రోగులకు పండ్లు, బట్టలు పంచుతాం" అని కేటీఆర్ తెలిపారు.

# నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

(మొదటి తరువాయి)

కమిటీ వేయాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం పార్లమెంట్ అనెక్స్ భవనంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి జెపి నడ్డా, అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్, అనుప్రియా పటేల్ (అప్నాదళ్), సీపీఐ(ఎం) తరఫున ఎంపీ జాన్‌బ్రిట్టాస్, కాంగ్రెస్ నేతలు జైరాం రమేష్, ప్రమోద్ తివారీ, గౌరవ్ గొగొరు, కె. సురేష్, జేడీయూ నేత ఉపేంద్ర కుష్వాహా, కె.ఆర్ సురేష్ రెడ్డి (బీఆర్ఎస్), లావు శ్రీకృష్ణదేవరాయులు (టీడీపీ), వల్లభనేని బాలశౌరి (జనసేన), విజయ సాయిరెడ్డి, మిథున్ రెడ్డి (వైసీపీ), టిఆర్ బాలు, తిరుచ్చి శివ (డీఎంకే), రాం గోపాల్ యాదవ్ (ఎస్పీ), సంజరు సింగ్ (ఆప్), సంతోష్ కుమార్ (సీపీఐ), వైకో (ఎండిఎంకె), సస్మిత్ పాత్ర (బీజేడీ), ఎన్‌కె ప్రేమ్ చంద్రన్ (ఆర్ఎస్పీ) తదితరులు పాల్గొన్నారు. అదానీ గ్రూప్‌పై ఆరోపణలు, మణిపూర్ అల్లర్లు, ఉత్తరప్రదేశ్‌లోని ఉప ఎన్నికల్లో అవకతవకలు, వక్ఫ్‌బిల్లుపై సభలో చర్చకు కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. అలాగే కాలుష్యం, రైలు ప్రమాదాలు వంటి అంశాలపై కూడా చర్చించాలని డిమాండ్ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ప్రమోద్ తివారీ మీడియాకు తెలిపారు. ప్రజా ప్రయోజనాల అంశాలపై చర్చ జరపాలని స్పష్టం చేశామన్నారు. అయితే అన్ని అంశాలపై చర్చకు కేంద్రం సిద్ధంగా ఉందని, సభ సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కోరారు. కాగా, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 20 వరకు జరగనున్నాయి. నవంబర్ 26న 75 ఏండ్ల రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంట్రల్ హాల్‌లో సంవిధాన్ సదన్ నిర్వహించనున్నట్టు కేంద్రం వెల్లడించింది. మరోవైపు వక్ఫ్‌సవరణ బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఈ నెల 29న తన నివేదికను పార్లమెంట్ కు సమర్పించే అవకాశం ఉంది. అలాగే వక్ఫ్‌బిల్లుతో సహా మొత్తం 16 బిల్లులను ఆమోదించుకునేందుకు జాబితా చేసింది.

పార్టీ ఫిరాయింపుల నిరోధక బిల్లు తీసుకురావాలి :కెఆర్ సురేష్ రెడ్డి (బీఆర్ఎస్)

ప్రభుత్వం తెచ్చే 16 బిల్లులతో పాటు "పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం సవరణ బిల్లు"ను కూడా తీసుకురావాలని బీఆర్ఎస్ ఎంపీ కెఆర్ సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అఖిల పక్ష సమాశానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులే కాదు, ప్రయివేట్ మెంబర్ బిల్లులపై కూడా పార్లమెంట్ లో సమగ్రంగా చర్చ జరగాలని కోరారు. కోర్టులపై ఇప్పటికే కేసుల ఒత్తిడి ఎక్కువగా ఉందని, పార్లమెంట్ పరిధిలోని అంశాలను కోర్టులకు తీసుకువెళ్లకుండా చట్టసభల్లోనే పరిష్కరించాలని కోరారు. "వక్ఫ్ చట్ట సవరణ బిల్లు మైనారిటీలకు వ్యతిరేకంగా ఉంటే తాము వ్యతిరేకిస్తామని అన్నారు. సమాజంలో విభజన, విభేదాలకు దారితీసే చర్యలను తాము సమర్థించమని పేర్కొన్నారు. విభజన చట్టం హామీలు పదేండ్లయినా పూర్తిగా అమలు కాలేదని, కాబట్టి ఇందులో సవరణలు చేస్తూ బిల్లు తీసుకురావాలని అన్నారు. సేకరణ చట్టానికి వ్యతిరేకంగా ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. "గిరిజన-ఆదివాసీ, దళితుల" భూములను సేకరిస్తోందని విమర్శించారు. ఈ అంశాలన్నింటినీ పార్లమెంటులో ప్రస్తావిస్తామని, చర్చకు పట్టుపడతామని అన్నారు.

లేటరల్ ఎంట్రీ ఉద్యోగాల భర్తీపై పార్లమెంటరీ కమిటీ

లేటరల్ ఎంట్రీతో ఉద్యోగాల భర్తీ సమస్యను పరిశీలించడానికి పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ శాఖల్లోని కీలక పోస్టుల భర్తీకి సంబంధించి ఈ ఏడాది ప్రారంభంలో రాజకీయ దుమారం రేపిన అంశాన్ని పార్లమెంటరీ కమిటీ పరిశీలించనుంది. లోక్‌సభ సెక్రెటేరియట్ వెల్లడించిన వివరాల ప్రకారం 2024-25లో పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్‌పై డిపార్ట్‌మెంట్ సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఎంపిక చేసిన సబ్జెక్టులలో సివిల్ సర్వీసెస్‌లో లేటరల్ ఎంట్రీ ఒకటి ఉంది. ఈ ఏడాది ఆగస్టులో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీపీఎస్సీ) కాంట్రాక్ట్ ప్రాతిపదికన లేటరల్ ఎంట్రీ మోడ్ ద్వారా భర్తీ చేయడానికి 45 పోస్టులను (10 జాయింట్ సెక్రెటరీలు, 35 డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రెటరీల) ప్రకటన చేసింది. ఈ ప్రకటన ప్రతిపక్షాలతో పాటు లోక్ జనశక్తి పార్టీ (జేఎల్‌పీ), జేడీయూ వంటి ఎన్‌డీఏ మిత్రపక్షాల నుండి వ్యతిరేకత వ్యక్తం అయింది. సీపీఐ(ఎం)తో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్‌జేడీ తేజస్వీ యాదవ్‌లతో సహా పలువురు నాయకులు షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ), ఓబీసీ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తుందని ధ్వజమెత్తారు. దీంతో ప్రభుత్వం తన ప్రకటనను రద్దు చేయాలని యూపీపీఎస్సీని కోరింది. బ్యూరోక్రాట్‌లు సాధారణంగా సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్ ప్రాసెస్ ద్వారా రిక్రూట్ చేయబడతారు. అయితే లేటరల్ ఎంట్రీ నియామకాలకు రిజర్వేషన్ కోటా వర్తించదు. ఇప్పటివరకు, 63 నియామకాలు లేటరల్ ఎంట్రీ ద్వారా జరిగాయి. వాటిలో 35 నియామకాలు ప్రయివేట్ రంగం నుంచి ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం 57 మంది అధికారులు మంత్రిత్వ శాఖలు/విభాగాల్లో పదవుల్లో ఉన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2018లో ఈ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు.

## 28న హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

(మొదటి తరువాయి)

కొనసాగాలని కోరారు. హేమంత్ సోరెన్ వెంట జార?ండ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మీర్, ఆర్‌జెడి నాయకులు జయ ప్రకాశ్ నారాయణ యాదవ్ ఉన్నారు. గవర్నర్‌తో భేటీ తరువాత మీడియాతో హేమంత్ సోరెన్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గవర్నర్ తమను ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ నెల 28న కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుందని తెలిపారు. ఆయనతోపాటు 12 మంది వరకూ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారని సమాచారం. లెజిస్లేటివ్ పార్టీ నేతగా హేమంత్ సోరెన్ ఎన్నిక రాజ్‌భవన్‌కు వెళ్లేముందు హేమంత్ సోరెన్ తన అధికారిక నివాసంలో జెఎంఎం ఎమ్మెల్యేలతోపాటు ఇండియా వేదిక ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జెఎంఎం లెజిస్లేటివ్ పార్టీ నాయకుడిగానూ, ఇండియా వేదిక సిఎం అభ్యర్థిగాను హేమంత్ సోరెన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం తరువాత రాజ్‌భవన్‌కు ఇండియా వేదిక నాయకులతో కలిసి హేమంత్ సోరెన్ వెళ్లారు. తనకు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు అందజేశారు. రాష్ట్రంలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకు గాను ఇండియా వేదిక 56 స్థానాల్లో విజయం సాధించింది. ఎన్‌డిఎ 24 స్థానాలకే పరిమితమైంది. జెఎల్‌కెం ఒక స్థానంలో గెలుపొందింది.

## మా ఇల్లు బఫర్ జోన్‌లో లేదు

(మొదటి తరువాయి)

చేస్తున్నారు. ఒకప్పటి పెద్ద చెరువునే 25 ఏండ్ల క్రితం క ృష్ణకాంత్ పార్కుగా మార్చారు. క ష్ణకాంత్ పార్క్‌కు మా ఇంటికి మధ్య వేలాది ఇండ్లు ఉన్నాయి. చెరువు కట్టకు దిగువన 10 మీటర్లు దాటితే బఫర్ జోన్‌పరిధిలోకి రావు. మా ఇల్లు చెరువు కట్టకు దాదాపు కిలోమీటర్ దూరంలో ఉంది" అని తెలిపారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి తరువాయి)

మంత్రివర్గ విస్తరణతో పాటు పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్ పదవుల భర్తీపై కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చించే అవకాశం ఉంది. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాలకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గేతో పాటు అగ్ర నేతలు సోనియా ఇతర ముఖ్య నేతలను కలిసి సీఎం ఆహ్వానించనున్నారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు సభకు హాజరుకావాలని రాహుల్ గాంధీని కోరనున్నట్టు తెలుస్తోంది. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కూతురు వివాహానికి హజరు కానున్నారు.

## డేటా ఎంట్రీ కీలకమైనది

(మొదటి తరువాయి)

ఉండమని కోరాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాఠశాల్లో ఆహారం, పరిశుభ్రతపై ప్రధానంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గం ప్రత్యేక దృష్టికి సాధించిందని చెప్పారు. ఈ రకమైన సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం, జీహెచ్‌ఎంసీ కమిషనర్, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులు

(మొదటి తరువాయి)

వరకూ గట్టి పోటీ ఎదుర్కొంది. కానీ చివరికి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రూపొందించిన వ్యూహం, ఆందోళన కలిగించే సామాజిక, ఆర్థిక సమస్యలపై ఆయన ప్రస్తావనలు, గ్రౌండ్-లెవెల్ ప్రచారం కూటమికి గట్టి విజయాన్ని అందించింది. ఆయన ప్రజల నాడిని అర్థం చేసుకుని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో నేరుగా మమేకం కావడం ఈ గెలుపుకు కీలక కారణంగా నిలిచింది. "సమాజంలో చివరి వ్యక్తి వరకు న్యాయం చేరాలని" విక్రమార్క తన ప్రచారంలో చెప్పిన సందేశం ప్రజల్లో అద్భుత స్పందన వచ్చింది.

**మహారాష్ట్రలో పవన్ మ్యాజిక్ :**

మరోవైపు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఎన్డీఏ తరఫున పవన్ కళ్యాణ్ కనిపించిన చోట ప్రచారం ఉరుములతో నిండిపోయింది. యువతతో పాటు మిగతా వర్గాలకూ ఆయన ప్రసంగాలు ప్రభావవంతంగా మారాయి. ప్రత్యేకంగా రైతుల సమస్యలు, ఉపాధి కష్టాలు, గ్రామీణ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలు ఎన్డీఏకు అనుకూలంగా మారాయి. కూటమికి జనం ఆశీర్వాదం రావడంలో పవన్ కళ్యాణ్ నింపిన జోష్ ముఖ్యపాత్ర పోషించింది. మహారాష్ట్రలో పవన్ గళం ప్రజలను కదిలించి ఎన్డీఏకు తిరుగులేని విజయాన్ని అందించింది.

**జాతీయ రాజకీయాల్లో తెలుగు ప్రభావం::**

ఒకరు ఇండియా విజయానికి పునాది వేయడంలో కీలక పాత్ర, మరొకరికి ఎన్డీఏ గెలుపు జెండాను రెపరెపలాడించడంలో స్ఫూర్తిదాయకంగా మారడం, ఈ రెండూ తెలుగు నేతల జాతీయ ప్రాధాన్యతను నిలబెట్టాయి. దేశ వ్యాప్తంగా ఈ గెలుపులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. భట్టి విక్రమార్క, పవన్ కళ్యాణ్ ఇద్దరూ జాతీయ రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. తెలుగు నాయకత్వం దేశ రాజకీయాల్లో కీలకమైన శక్తిగా మారుతుందనే చర్చ మొదలైంది.

ఈ విజయాలు, ప్రత్యేకించి భిన్న కూటముల్లో భాగమైనప్పటికీ, తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచాయి. దేశ రాజకీయాల్లో తెలుగు నేతల ప్రాధాన్యత మరింత పెరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం ఓ ప్రారంభం. దేశ రాజకీయం కొత్త గమనంలోకి దారితీస్తున్న తెలుగు నేతల గర్జన మరింత బలంగా వినిపించబోతోంది అని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# షాద్ నగర్ ఇండోర్ స్టేడియంకి 2.75 కోట్లు మంజూరు

-హర్షం వ్యక్తం చేసిన షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కబీర్ అహ్మద్

-ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ కి ధన్యవాదాలు



షాద్ నగర్,నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్) : రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ లో ఉన్న ఇండోర్ స్టేడియం అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2 కోట్ల రూపాయల 75 లక్షల మంజూరు చేయడం జరిగింది. దీనికి సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ యువ నాయకులు కబీర్ అహ్మద్ తెలిపారు.

# వనస్థలీపురంలో వనమహోత్సవ వేడుకలు



హైదరాబాద్, నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్) వనస్థలీపురంలోని అనన్య ఏకో రిసార్ట్స్‌లో ఆదివారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో వన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ డి.కె.అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు రెడ్డి సామాజికవర్గ పెద్దలు మరియు రెడ్డి జాగృతి నాయకులు సాదర స్వాగతం పలికారు. అరుణ మాట్లాడుతూ, "రెడ్డి సామాజికవర్గం కలసి పాటుగా ఉండేందుకు, సమాజంలోని అన్ని వర్గాల వారు సుఖసంతోషాలతో ఉండాలని కోరే సమాజంగా పేరొందింది. వన మహోత్సవం ద్వారా ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఎవరు కష్టమంటే వారందరిని అక్కున చేర్చుకుని సహాయం చేసే గుణమున్న వారు రెడ్డి కులస్తులు. కులమత బేధాలు లేకుండా సామాజిక సేవలో వారు పోషిస్తున్న పాత్ర మరువలేనిది. ఇది తరతరాలుగా కొనసాగించాలి." ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, తనను ఆహ్వానించిన నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు రెడ్డి సామాజికవర్గ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు వెంకటేశ్వర స్వామి చిత్రపటం అందించిన దేవన్న నాయుడ



వనపర్తి నవంబర్ 24 (నీలగిరి ఎక్సప్రెస్): ఇటీవల తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునీ వచ్చిన సందర్భంగా వనపర్తి ఎంఎల్ఏ తూడి మేఘారెడ్డి కి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వాల్మీకి సంఘం కన్వీనర్. కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు ఆదివారం ఉదయం తిరుమల హిల్స్ ఎమ్మెల్యే నివాసంలో తిరుమల వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఆ దేవదేవుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నామని అన్నారు. ఎమ్మెల్యేకు వెంకటేశ్వర స్వామి చిత్ర పటాన్ని అందజేసిన అనంతరం మీ హాయంలో వనపర్తి పట్టణం, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని మొక్కుకున్నట్లు మండ్ల దేవన్ననాయుడు తెలిపారు . ఈ సందర్భంగా ఒకటో వార్డు రాయి గడ్డ లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వార్డులో కల్వర్టుల మీద మ్యానువల్స్, పురాతన కాలం నుండి ఉన్న రెండు ఇనుప కరెంటు స్తంభాలను మార్చాలని, సిసి రోడ్స్ గూర్చి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. సానుకూలంగా స్పందించిన మేఘారెడ్డి త్వరలోనే పనుల్లో మంజూరు చేయించి ప్రారంభిద్దామని అన్నారని దేవన్న నాయుడు తెలిపారు.

# కొత్తగూడెం మున్నూరుకాపు వనసమారాధన మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ వద్దిరాజు





కొత్తగూడెం, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్): రాజకీయాలలో న్యాయమైన హక్కుల సాధనకు,వాటా దక్కించుకునేందుకు మనమందరం మరింత సంఘటితంగా ముందుకు సాగుదామని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు.రాష్ట్ర జనాభాలో మున్నూరుకాపులు 20శాతానికి పైగా ఉన్నప్పటికి సరైన ప్రాతినిథ్యం లభించకపోవడం విచారకరమన్నారు.కార్తీక మాసం సందర్భంగా కొత్తగూడెంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆదివారం ఏర్పాటు చేసిన వనసమారాధన మహోత్సవానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మున్నూరుకాపులకు సముచిత రీతిలో పదవులిచ్చి గౌరవించారన్నారు. తనతో పాటు మరో ఇద్దరిని రాజ్యసభ కు పంపారని, ఆరుగురిని ఎమ్మెల్సీలను చేశారని, పది మందికి ఎమ్మెల్యే సీట్లించి, ఇద్దరిని హైదరాబాద్ మహానగర మేయర్లను చేసి గుర్తింపునిచ్చారని వివరించారు. అదే కాంగ్రెస్ గత ఎన్నికల్లో ముగ్గురికి ఎమ్మెల్యే సీట్లిస్తే,అందులో ఒకరే గెలిచారని, మంత్రిమండలిలో స్థానం కల్పించలేదని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.కులగణన సందర్భంగా మన వాళ్లు మున్నూరుకాపు అని తప్పకుండా రాయాలని, జనాభాలో పెద్ద సంఖ్యలో ఉన్న విషయాన్ని నిరూపించుకోవాలని సలహానిచ్చారు.అవసరమైన, ముఖ్యమైన ప్రతి సందర్భంలో కూడా మనం బల ప్రదర్శన చేయాలని, సంఘటిత శక్తిని చాటి చెప్పాలన్నారు.వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, లోకసభ సీట్లు పెరుగుతాయని, మహిళా,బీసీ రిజర్వేషన్లు అమలు కానున్నాయని ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవలసిన అవసరం ఉందని ఎంపీ వద్దిరాజు వివరించారు.ఇందుకుగాను మనం ఇతర బీసీ కులాల వారితో స్నేహభావాన్ని పెంపొందించుకుంటూ రాజ్యాధికారం వైపు వడివడిగా అడుగులు వేద్దామన్నారు.హైదరాబాద్ కోకాపేటలో కేసీఆర్ కేటాయించిన విలువైన ఐదెకరాలలో మున్నూరుకాపు భవనాన్ని గొప్పగా నిర్మించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశామన్నారు. అలాగే, కొత్తగూడెం,పాల్వంచలలో భవనాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందజేస్తానని ఎంపీ రవిచంద్ర హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మునిసిపల్ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ, మున్నూరుకాపు ప్రముఖులు ఎడవెల్లి కృష్ణ, గడల శ్రీనివాసరావు, ఆకుల గాంధీ, వనమా రాఘవ, మరికల్ పోత సుధీర్ కుమార్, శీలంశెట్టి వీరభద్రం,రంగా కిరణ్, కాపు కృష్ణ,ఆళ్ల మురళి,భీమా శ్రీధర్, సత్యభామ, భండారు రుక్మేందర్ రావు, కాసుల వెంకట్, కొత్వాల శ్రీనివాస్, జోగం తారక రామారావు, వల్లాల ప్రసాదరావు, హన్మంతరావు, బాపట్ల మురళి, తోట దేవీప్రసన్న, రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా "జై తెలంగాణ"," జైజై మున్నూరుకాపు", "వర్ధిల్లాల్లి వర్ధిల్లాల్లి మున్నూరుకాపుల ఐక్యత వర్ధిల్లాలి" అనే నినాదాలు మిన్నంటాయి. ఈ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరైన మున్నూరుకాపులంతా ఆత్మీయంగా పలకరించుకుంటూ భోజనాలు చేశారు.

# కల్వకుర్తిలో గద్దర్ విగ్రహ భూమి పూజ





కల్వకుర్తి, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) కల్వకుర్తి పట్టణ పరిధిలో రాష్ట్ర సాంస్కృతిక మండలి చైర్మన్ వెన్నెల, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలాజీ సింగ్ లతో కలిసి భూమి పూజలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ దగ్గర గద్దర్ విగ్రహ పూజ జరిగింది. ఈ సందర్భంగా బాలాజీ సింగ్ మాట్లాడుతూ, "రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద బిఆర్ఎస్ పార్టీ వాళ్ళు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, పది సంవత్సరాల కాలంలో లేని అభివృద్ధి 11 నెలల్లో ఎలా సాధ్యమవుతుందో వివరించాలని ఎద్దేవా చేశారు. అదే విధంగా కేసిఆర్ గద్దర్ కి కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వకుండా అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, "గద్దర్ లాంటి మహానుభావుడు విగ్రహం స్థాపించుకోవడం మన పూర్వజన్మ సుకృతం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గద్దర్ ఎన్నో ప్రయత్నాలు చేశారు, పాటల ద్వారా ఉద్యమం ద్వారా ఎన్నో త్యాగాలు చేసిన వ్యక్తి" అని పేర్కొన్నారు. గద్దర్ కూతురు, రాష్ట్ర సాంస్కృతిక మండలి వెన్నెల మాట్లాడుతూ, "పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిన గద్దర్ లేకపోవడం ఎంతో బాధాకరం. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాంస్కృతిక కళ చైర్మన్‌గా నియమించినందుకు ధన్యవాదాలు అని ఖచ్చితంగా కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం బాసటగా ఉంటుంది అని తెలిపారు. అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్,వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి ,వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు మాజీ సర్పంచ్ కరుణశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వనమహోత్సవం





ఆమనగల్లు, నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్): కడ్తాల్ మండలం మైసగండి రామాలయం, శివాలయాలలో ఆదివారం కార్తీక వనమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ కేశవులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం పచ్చని వనంలో భక్తులంతా ఉత్సాహభరితంగా ఆటలు, పాటలతో సందడి చేశారు. ఉసిరి చెట్టు కింద వనభోజనాలు చేస్తూ, కార్తీక మాసంలోని పవిత్రతను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘానికి చెందిన మహిళలు గుర్రం వరలక్ష్మి, పాలాది లక్ష్మి, భవండ్ల సువర్ణ, దర్శిని, శ్రీదేవి, సరిత, దివ్య, ఏలే వనిత, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు. కార్తీక వనమహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.

# శిథిలావస్థలో తిమ్మాయిపల్లి పాఠశాల









**చారగొండ, నవంబర్ 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని ప్రతిష్టాత్మక పథకాలు చేపడుతూ, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, చారగొండ మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఆ లక్ష్యానికి పూర్తి వ్యతిరేకంగా కనిపిస్తోంది. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం, విద్యార్థుల భవిష్యత్తుకు పెను ముప్పుగా మారింది. తిమ్మాయిపల్లి గ్రామస్థులు చెబుతున్న వివరాలు చూస్తే, ఈ ప్రాథమిక పాఠశాల అనేక ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది. పాఠశాల భవనం పూర్తిగా దెబ్బతిన్న స్థితిలో ఉండటంతో, పిల్లల భద్రతకు పెనుముప్పుగా మారింది. విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. గ్రామ ప్రజలు ఇలాంటి పరిస్థితులకు కారణం అధికారుల నిర్లక్ష్యమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ప్రభుత్వ పాఠశాలను నమ్మి తమ పిల్లల్ని ఇక్కడికి పంపిస్తే, ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయనుకోలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇంతటితో సరిపెట్టక, గ్రామంలోని అంగన్వాడి పరిస్థితి కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అంగన్వాడికి సొంత భవనం లేకపోవడంతో పాటు టీచర్ల కొరత కూడా ఉంది. ఇది చిన్నారుల పౌష్టికాహారానికి, వారి ప్రాథమిక అభ్యాసానికి గండి కొడుతోంది. ఈ సమస్యలు పిల్లల భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పుకుంటూనే, తిమ్మాయిపల్లి వంటి గ్రామాల్లో ఇలాంటి దుర్భర పరిస్థితులు వెలుగులోకి రావడం అధికారుల నిర్లక్ష్య ధోరణిని వెల్లడిస్తోంది. విద్యకు సంబంధించిన ప్రతిష్టాత్మక పథకాలు కేవలం కాగితం మీదే మిగిలిపోతున్నాయా అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్పొరేట్ స్థాయిలో విద్య అందించాలన్న లక్ష్యానికి చేరుకునేందుకు, ప్రభుత్వ పాఠశాలలు కనీస మౌలిక సదుపాయాలను కూడా కల్పించడంలో విఫలమవడం దిగ్భ్రాంతికరం.

# కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా టిపిటిఎఫ్ అభ్యర్థి వై. అశోక్ కుమార్ ను గెలిపించండి.

**-ఉపాధ్యాయులకు టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పిలుపు.**

**హైదరాబాద్, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఉపాధ్యాయుల హక్కులు పరిరక్షణ,సమస్యల పరిష్కారం, విద్యారంగ అభివృద్ధి మరియు ఉద్యమాలే ఎజెండాగా జరగాల్సిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ధన ప్రవాహం చుట్టూ తిరుగుతున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు సంచుల తో ప్రవేశించి విద్యారంగాన్ని కలుషితం చేస్తున్నారు. ఉపాధ్యాయుల,విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న టీపీటీఎఫ్ అభ్యర్థి మరియు తెలంగాణ ఉద్యమ జేఏసీ నాయకులు వై.అశోక్ కుమార్ ను గెలిపించాలని టీపీటీఎఫ్ జనరల్ కౌన్సిల్ సమావేశం ఉపాధ్యాయలోకానికి పిలుపునిచ్చింది. హైదరాబాద్ అబిడ్స్ లోని ఫర్వానా హాల్లో టిపిటిఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి సంస్థ రెండు సంవత్సరాల కార్యక్రమాల నివేదికను కౌన్సిల్లో ప్రవేశపెట్టడం జరిగింది. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర




కౌన్సిలర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నివేదిక పై చర్చించి ఆమోదించిడం జరిగింది. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కరీంనగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి డబ్బు సంచుల తో ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురి చేయడానికి వస్తున్నారని ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి ఉపాధ్యాయుల హక్కుల కోసం, విద్యా రంగ అభివృద్ధి కోసం పోరాడే సమరశీల అభ్యర్థినే ఎన్నుకోవాలని కోరారు. తాను అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం బలమైన ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణానికి కృషి చేసి సిపియస్ రద్దు కోసం, సమగ్ర శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ మరియు టైం స్కేల్ పొందడానికి పనిచేస్తానని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లకు కూడా ఎమ్మెల్సీ ఓటు హక్కు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రజాప్రతినిధిగా చట్ట సవరణకు కేంద్రానికి పంపాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధనపు ప్రధాన కార్యదర్శి యం.రవీందర్, ఉపాధ్యాయ దర్శిని పత్రిక ప్రధాన సంపాదకులు యం.ప్రకాశ్ రావు, ఫెడరేషన్ సీనియర్ నాయకులు కె.వేణుగోపాల్, వి.మనోహర్ రాజు, బి.కొండల్ రెడ్డి, మైసా శ్రీనివాస్, ఏ.రాంచంద్రం మరియు రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు యన్ తిరుపతి, డి.శ్రీనివాస్, పి.నారాయణమ్మ, పి.మహేందర్ రెడ్డి, యం.క్రిష్ణా రెడ్డి, ఎ.భాస్కర్ రెడ్డి కార్యదర్శులు కే.భోగేశ్వర్, యస్. కనకయ్య, ఆర్.రమేశ్, యం.రాములు, జి.ఎల్లయ్య, ఎ.భుజంగరావు, యస్. కవిత పాల్గొన్నారు

# 30న రైతు సదస్సు ను విజయవంతం చేయండి

**-సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి**



**వనపర్తి నవంబర్ 24 (నీలగిరి ఎక్సప్రెస్):** ఈనెల 30న మహబూబ్ నగర్ లోజరగనున్న రైతు సదస్సును రైతులంతా తరలివచ్చి విజయవంతం చేయాలి అని కాంగ్రెస్ రైతు సంఘం అధ్యక్షులు అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆదివారం పెద్దమందడి మండలంలోని అలవాల, పెద్దమందడి, మణిగిల గ్రామాలలోని కొనుగోలు కేంద్రాల దగ్గరకి వెళ్లి రైతులను కోరడం జరిగింది. వ్యవసాయంలో వచ్చిన ఆధునాతన సాగు పద్ధతులు, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈనెల 28 నుండి రైతుల కోసం వివిధ వ్యవసాయ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని. ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారని యూనివర్సిటీ అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పంప్ కంపెనీలు నూతన ఆవిష్కరణలు, రైతులకు ఉపయోగపడేందుకు అందుబాటులోకి వచ్చిన వివిధ కంపెనీ వినూత్న ఉత్పత్తులను ఇక్కడ స్టాల్ ఏర్పాటు చేసి ఉంచుతారని ఆధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు, వాటిని అన్నిటిని ప్రదర్శనలో ఉంచుతారు. రైతులందరూ 30న జరిగే సభను వచ్చి వెళ్లే విధంగా కాకుండా రైతులకు అవగాహన కల్పించేలా మూడు రోజులపాటు 28వ తేదీ నుండి స్టాళ్లను అందుబాటులో ఉంచి మహబూబ్ నగర్ లో రైతు సదస్సులు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేలా సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని రైతులందరూ పాల్గొని రైతు అవగాహన సదస్సు విజయవంతం చేయాలని ఆయన కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో పెద్దమందడి సింగల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, సింగల్ విండో డైరెక్టర్ నరేష్ కుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, గట్టు మన్యం, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చౌదర్పల్లి గ్రామ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి



**వెల్దండ, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వెల్దండ మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో పలు సమస్యల గురించి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి యువ నాయకుడు మారేపల్లి రమేష్ గౌడ్ వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపత్రంలో వాటర్ ట్యాంక్, స్ట్రీట్ లైట్, ఆట స్థలము, అండర్ డ్రైనేజ్ కాల్వ వంటి సమస్యలను ఆయన వివరించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్ రెడ్డి గారిని సన్మానించిన ఏఎంసి ఛైర్మన్ యాట గీత నరసింహ



**కడ్తాల్, నవంబర్ 24,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన యాట గీతా నరసింహ ఆదివారం ఏఐసిసి కార్యదర్శి, సిడబ్ల్యుసి సభ్యుడు చల్లా వంశీచంద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి వంశీ ఆశ్లేష రెడ్డి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మార్కెట్ చైర్మన్ గా తన నియమకానికి సహకరించినందుకు వంశీచంద్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు . రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వంశీచంద్ చైర్మన్ గీత నరసింహకు సూచించారు. అదేవిధంగా టీపీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, టియూఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, బడంగ్ పేట మేయర్ పారి జాత నరసింహారెడ్డిలను గీత నరసింహ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

## ఒగ్గు కిషోర్ స్వగృహంలో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



**షాద్ నగర్,నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** షాద్ నగర్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్ స్వగృహానికి రామగుండము కమిషనర్ ఆఫ్ పోలీస్ విచ్చేశారు. పుట్టిన రోజూ వేడుక జరుపుకుంటున్న కిషోర్ కూతురు ఒగ్గు దేవిశ్రీ కమిషనర్ ఆశీర్వాదించారు. మంచిగా చదువు కోవాలని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు.

## ఇసుక మాఫియాకు పోలీసువారి హెచ్చరిక

**-మధిర పట్టణ ఎస్సై ఎన్.సంధ్య**



**(నీలగిరి ఎక్సప్రెస్):/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం** మధిరలో ఏదేచిగా అక్రమ ఇసుక రవాణా జరుగుతా ఉంది. ఎస్సై సంధ్య అక్రమ ఇసుక రవాణా దారులను పోలీస్ స్టేషన్ కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు.ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే వారిని తహసీల్దార్ ముందు బైండ్ ఓవర్ చేసి లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని మధిర పట్టణ ఎస్ఐ ఎన్ సంధ్య వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటి నుండి అక్రమ ఇసుక రవాణా జరిగితే తప్పకుండా తాసిల్దార్ ముందు బైండ్ ఓవర్ చేస్తానని అన్నారు.

## మానసిక పిల్లల కు ఫిట్ ఫార్ములా .

-మానసిక పిల్లలకి అండదండగా ఉంటా
తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 24,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
చేతుల మీదుగా ఫిట్ ఫార్ములా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మానసికంగా ఉన్న పిల్లలతో గేమ్స్ ఆడించారు.ఈ సందర్భంగా స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, మాట్లాడుతూ ఇలాంటి మానసికంగా ఉన్న పిల్లలకు ఫిట్ ఫార్ములా ఫౌండేషన్ చైర్మన్ వినోద్ కు ధన్యవాదాలు చెప్పారు. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి మానసికంగా ఉన్న పిల్లలు చాలా మంది ఉన్నారు వాళ్ళని మీరు గుర్తించి ఇలాంటి గేమ్స్ ఆడించడం చాలా ఆనందంగా ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏ విధమైన సాయమైనా కావాలి అంటే నాకు చెప్పండి కచ్చితంగా ఇలాంటి మానసికంగా ఉన్న పిల్లలకి అండదండగా ఉంటానని చెప్పడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వారు గద్వాల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దీపక్, కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షు లు కాటూరి రమేష్, ఖైరతాబాద్ నియోజకవర్గ ఆర్గనైజర్ సెక్రెటరీ మచ్చల విష్ణు, గుంజ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



ఆమనగల్లు, నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ మరియు టాస్క్ – సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరు రోజులుగా విజయవంతంగా కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా సాగుతోంది. రెండు రోజులుగా కొనసాగుతున్న కంటి శుక్లాల ఆపరేషన్లు సుమారు 57 మందికి విజయవంతంగా పూర్తయ్యాయి. ఈనెల 27 వరకు విడతలవారిగా ఆపరేషన్లు కొనసాగనున్నాయి, మరియు కంటి పరీక్షలు ప్రక్రియ నేటితో ముగియనుంది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు 4200 మందికి పైగా ప్రజలు పాల్గొనగా, 3000 మంది పేషంట్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 2200 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 120 మందికి పైగా కంటి శుక్లాల ఆపరేషన్లు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోలీస్ చంద్ర శేఖర్ మరియు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, శ్రీనివాస్ రెడ్డి, చంద్ర శేఖర్, మల్లేష్ నాయక్, కొండల్ రెడ్డి, అభినవ్ రెడ్డి, కొండల్ యాదవ్, రమేష్ నాయక్, మల్లయ్య, శేఖర్, యాదయ్య, శ్రీపతి, శ్రీను, మహేష్, కాకి శివ, కళ్యాణ్ లతో పాటు తదితరులు ఉన్నారు.

## సామాజిక చైతన్యానికి విద్య ఒక ఆయుధమని నమ్మాను

-ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందడం ఎంతో ఆనందంగా ఉంది
-డా,, చిట్టి రాజుల యాదగిరి



వనపర్తి నవంబర్ 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
సామాజిక చైతన్యంఅనేది విద్య వల్లనే జరుగుతుందని, సమాజాన్ని చైతన్య పరచాలంటే విద్య ఒక ఆయుధంలా పనిచేస్తుందని, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సంపాదించిన చిట్టి రాజుల యాదగిరి అన్నారు. వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం ఎదుట్ల గ్రామానికి చెందిన చిట్టిరాజుల యాదగిరి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ను రాజనీతి శాస్త్ర విభాగంలో 'తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి కార్యాచరణ కమిటీల పాత్ర,హైదరాబాద్ జిల్లాలో అధ్యయనం పై ప్రొఫెసర్ నాయుడు అశోక్ పర్యవేక్షణా లో పరిశోధనను పూర్తి చేశాను అని, ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తూను అని,తనను ప్రోత్సహించి సహకారం అందించిన తల్లిదండ్రులకు అన్నయ్యలకు కృతజ్ఞతలు తెలియ జేశారు.తమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఉన్నత చదువులు చదివి పరిశోధన పూర్తి చేయడం మాకు ఎంతో గర్వకారణంగా ఉందని మిత్రులు శ్రేయోభిలాషులు, రోజు శు భాకాంక్షలు తెలియజేస్తున్నారని తనకు తెలిసిన విద్యను పదిమంది పేద విద్యార్థులకు పంచుతానని వీలైనంత ఎక్కువ మందిని చైతన్యపురుస్తానని అని అన్నారు.

# నేరేడుచర్ల లో మున్నూరు కాపు కార్తీకమాస వనభోజనాలు...

-ముఖ్య అతిథులుగా పాల్గొన్న మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్వ డిసిఎంఎస్ చైర్మన్ జల్లేపల్లి వెంకటేశ్వరరావు (జేవిఆర్)...
-కులగనన న్యాయబద్ధంగా జరిపించాలి...
-కార్పొరేషన్ కు 3 వేల కోట్ల రూపాయల నిధులు కావాలి...



నేరేడుచర్ల, నవంబర్ 24(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :
సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని మున్నూరు కాపు కార్తీకమాస వనభోజనాలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు, నల్గొండ పూర్వ డిసిఎంఎస్ చైర్మన్ జల్లేపల్లి వెంకటేశ్వరరావు (జేవిఆర్) సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో కార్తీక మాసం వనభోజనాలు జరుపుకోవడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు, నల్గొండ పూర్వ డీసీఎంఎస్ చైర్మన్ జల్లేపల్లి వెంకటేశ్వరరావు (జె.వి.ఆర్) ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మున్నూరు కాపులు తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉన్నారని వనభోజ కార్యక్రమాలు ముక్కోటి దేవతలు భూభాగంలో ఉన్న ప్రజలందరినీ ఆశీర్వదిస్తారని, మంచి మనసున్న పదిమందికి అన్నం పెట్టి అండగండలుగా ఉండే మున్నూరు కాపులను ముక్కోటి దేవతలను ఆశీర్వదిస్తారని, ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ సమాజ శ్రేయస్ కోసం పాటుపడే మున్నూరు కాపులు వనభోజనాల సందర్భంలో ఎక్కడెక్కడ ఉన్నవారు అందరూ ఒక దగ్గరికి వచ్చి కలిసి భోజనం చేసి సుఖసంతోషాలను పంచుకుంటూ ఐకమత్యంగా ఉండాలని కోరుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం కులగనన న్యాయబద్ధంగా జరిపించాలని కోరారు. ప్రతి ప్రభుత్వంలో మున్నూరు కాపులకి అన్యాయం జరుగుతుందని ఎలక్షన్ల కంటే ముందు మున్నూరు కాపులకు ఆశపెట్టి హక్కులకి అవకాశాలని, కోరికలను తీరుస్తామని చెప్పి జనాభా ప్రాతిపదికన మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఇస్తామని కార్పొరేషన్ కి నిధులు ఇస్తామని, ప్రతి జిల్లాకి మున్నూరు కాపుల భవనాలకు నిదురిస్తామని హామీలు ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత మున్నూరు కాపులను విస్మరిస్తున్నారని, గత అసెంబ్లీ ఎలక్షన్లో ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో మున్నూరు కాపుల కార్పొరేషన్ ఇస్తామని 3 వేల కోట్ల రూపాయల నిధుల్ని కేటాయిస్తామని ప్రతి జిల్లా కేంద్రాలలో మున్నూరు కాపులకి భవన నిర్మాణాలకి హాస్టల్స్ కి భూమి ఇచ్చి నిధుల కేటాయిస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత గౌరవనీయులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మున్నూరు కాపుల ఓట్లతోటే మన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి రావడం జరిగింది అని చెప్పడం జరిగింది ప్రకటించి అది కార్పొరేషన్ కాదు సొసైటీ అని చెప్పని చెప్పడం జరిగింది. ప్రతి జిల్లా కేంద్రానికి రెండు ఎకరాల భూమి రెండు కోట్లు నిధులు ఇస్తున్నమని చెప్పని మన బీసీ వెల్ఫేర్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్ అన్న గారు చెప్పడం జీవోను కూడా పత్రిక మీడియా పరంగా చూపించడం కూడా జరిగింది అయినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం గానీ మంత్రులు గాని, దాని విషయాన్ని మర్చిపోవడం చాలా బాధాకర ఒకటే ముఖ్యమంత్రి గానీ ప్రభుత్వ గానీ కాంగ్రెస్ పార్టీ కానీ గుర్తుంచుకోవాల్సిన విషయం. కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి మున్నూరు కాపుల ఓట్లు ఎంతయితే ఉపయోగపడినవో స్థానిక సంస్థల ఎలక్షన్లలో లోపు అనుకున్న ప్రకారంగా ఇచ్చిన హామీల ప్రకారంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో లేనిపక్షంలో స్థానిక సంస్థలో కాంగ్రెస్ పార్టీకి మున్నూరు కాపు ప్రజలు వ్యతిరేకంగా చేయటానికి కూడా వెనక్కి రారు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరు కాపు లీగల్సేల్ అధ్యక్షులు ఊస రఘు, మరి కార్యక్రమ నిర్వాహకులు ధనుంజయ నాయుడు రాష్ట్ర కార్యదర్శి కోలా నాగేశ్వరావు ఇంకా మున్నూరు కాపు కుల పెద్దలు ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొనడం జరిగింది.

# విత్తన ధ్రువీరణ అధికారుల ఆత్మీయ సమ్మేళనం

-ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చి రెడ్డి.





హైదరాబాద్, నవంబర్ 24, (నీలగిరి ఎక్స్ ప్రెస్):
లక్డీకాపూల్ అశోక హోటల్ లో ఆదివారం రోజు తెలంగాణ విత్తన ధృవీకరణ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరిగింది
ఈ ఆత్మీయ సమ్మేళన సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యోగుల JAC చైర్మన్ వి. లచ్చిరెడ్డి మరియు వ్యవసాయ అధికారుల సంఘం నాయకులు, అదేవిధంగా వివిధ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు హాజరవడం జరిగింది. ఈ సమావేశానికి, తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ కు చెందిన హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, గద్వాల్ డివిజన్లకు చెందిన విత్తన ధ్రువీకరణ అధికారులు (ఎస్ సీ ఓ) మరియు ఇతర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పర్మినెంట్ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యంగా, తెలంగాణ విత్తన రంగ అభివృద్ధిలో విత్తన ధ్రువీకరణ అధికారుల పాత్ర, ఉద్యోగుల సమస్యలు, ఇతరత్రా బెనిఫిట్స్ పైన ప్రత్యేకంగా చర్చించడం జరిగింది.ఈ సమావేశం సందర్భంగా, ఉద్యోగుల JAC చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో విత్తన ధ్రువీకరణ అధికారులది కీలకం అని, వారి బెనిఫిట్స్ గురించి తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, విత్తన ధృవీకరణ ఉద్యోగులు కూడా మేము ఏర్పాటు చేసిన JAC లో భాగస్వామ్యం అవటం అభినందనీయం అని, విత్తన ధ్రువీరణ ఉద్యోగులకు ఏ సమస్యలు వచ్చినా JAC అండగా ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అవసరం అయితే, విత్తన ధ్రువీకరణ అధికారులకు సబంధించిన సమస్యలు, బెనిఫిట్స్ గురించి సీఎం రేవంత్ రెడ్డి గారికి జేఏసీ ద్వారా లిఖిత పూర్వకంగా విన్నవిస్తామని చైర్మన్ లచ్చి రెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా, విత్తన ధృవీకరణ సంస్థ అనేది ఒక చిన్న సంస్థగానే ఉన్న, ఈ సంస్థ వల్ల, విత్తన ధృవీకరణ అధికారుల వల్ల వ్యవసాయ రంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడంలో ప్రముఖ పాత్ర ఉంటుందని, విత్తన ధ్రువీకారణ అధికారులు కూడా ఒక ఉన్నతమైన పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగంలో చేరారని, ఇలాంటి సంస్థ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని లచ్చి రెడ్డి అభిప్రాయపడ్డారు. విత్తన ధ్రువీరణ సంస్థను కూడా వ్యవసాయ సహకార శాఖ కిందా ఒక ప్రత్యేక విభాగం కింద ప్రభుత్వం పరిగణించి, ఒక డిపార్ట్ మెంట్ హోదా కల్పించి రైతులకు నాణ్యమైన విత్తనాలు పకడ్బందీగా సరఫరా విధంగా చూడాలని చైర్మన్ లచ్చిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల సంక్షేమమేపాల్గొన్నవారు జేఏసీ కి ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వానికి కూడా ఇన్కమ్ జనరేషన్ సోర్స్ గా పనిచేయాలని లచ్చిరెడ్డి అభిప్రాయపడ్డారు, ఇతర రాష్ట్రాలలో విత్తన ధృవీకరణ సంస్థల పనితీరు అధ్యయనం చేసి, పక్కన ఉన్న తమిళనాడు రాష్ట్రం మాదిరిగా విత్తన ధృవీకరణ సంస్థను డిపార్ట్ మెంట్ స్టేటస్ క్రింద పరిగణించాలని, అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తిరుపతి నాయక్ తెలిపారు అదేవిధంగా, విత్తన ధ్రువీకరణ ఉద్యోగుల వార్షిక సర్వ సభ్య సమావేశం కూడా జరిగింది. మరో మూడు సంవత్సరాలకు అసోసియేషన్ కమిటీని కూడా ఎన్నుకోవటం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యంగా ఈ క్రింది అంశాలపైన చర్చించడం జరిగింద్ని ఉద్యోగుల పెన్షన్ ను 30 వేలకు పెంచాలని ప్రతిపాదించారు విత్తన ధృవీకరణ సంస్థకు ఒక డిపార్ట్ మెంటల్ స్టేటస్ ను కల్పించి వ్యవసాయ శాఖ లో ఒక ప్రత్యేక విభాగం క్రింద చేర్చాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించి వారి జీతాలను పెంచాలని కాంట్రాక్ట్ ప్రాతిపదిక ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ ఏ) ల కు వ్యవసాయ విస్తరణ అధికారి బేసిక్ సాలరీకి సమానంగా, 32,000 లకు పెంచాలని ఉద్యోగులకు కొత్త హెల్త్ ఇన్స్యూరెన్స్ పాలసీని తీసుకువచ్చి వారికి ఆరోగ్య భద్రత కల్పించాలని చర్చించారు ఆత్మీయ సమ్మేళన సమావేశంలో వి. లచ్చిరెడ్డి, చైర్మన్, జేఏసీ తెలంగాణ ఉద్యోగుల తిరుపతి నాయక్, జనరల్ సెక్రటరీ, అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ పెబ్బేటి మహేష్, జనరల్ సెక్రటరీ, తెలంగాణ విత్తన ధ్రువీరకరణ అధికారుల అసోసియేషన్ టి.జయ ప్రకాష్, ప్రెసిడెంట్, తెలంగాణ విత్తన ధ్రువీరకరణ అధికారుల అసోసియేషన్ వి. పృథ్వి రాజ్, ట్రెజరర్, తెలంగాణ విత్తన ధ్రువీరకరణ అధికారుల అసోసియేషన్ పాల్గొన్నరు.

# ఖమ్మంలో కుల వివక్షత దారుణం

-ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేధిక జిల్లా కన్వీనర్? బాణోత్? భద్రునాయక్?



(నీలగిరి ఎక్స్‌ప్రెస్):/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం
మత సామరశ్యానికి చిరునామాగా ఉన్న ఖమ్మం జిల్లాలో కుల వివక్షత జాఢ్యం వెలుగుచూడడం దారుణమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేధిక జిల్లా కన్వీనర్? బాణోత్? భద్రునాయక్? ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం కరుణగిరి ప్రాంతంలోని ఒక అపార్ట్? మెంటులో మాత్రమే ఇలాంటి ఉదంతం చోటుచేసుకుందని,మరెక్కడా లేదని భావించడం తప్పని ఖమ్మంలోని చాలా ప్రాంతాలలో వెలుగు చూడని కుల వివక్షత దాగిఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎక్కడో హైదరాబాదు లేదా కరీంనగర్?, నిజామాబాద్?, మహబూబ్? నగర్? ప్రాంతాల్లో మాత్రమే మత కలహాలు జరగడం, కుల వివక్షత ఘటనలు చోటుచేసుకోవడం చాలా సార్లు మనం గమనించి ఆశ్చర్యపోతున్నాము.నిజానికి ఇది ఖమ్మంలో కూడా ఎప్పటినుండో కానరాకుండా జరుగుతోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీలు అంటే చిన్నచూపుకు కారణం గత దశాబ్ద కాలం నుంచి బాగా పెరిగిన బీజేపీ ప్రాభల్యం దీనిని ఖమ్మం జిల్లాలోని కుల ప్రజా సంఘాలు,వివిధ పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించడమే కాకుండా,దీనిపై ఒక కార్యచరణను రూపొందించాలని కోరారు. మతతత్వ, కులతత్వ,విక్షను ప్రదర్శిస్తున్న నిందితులను కఠినంగ శిక్షించాలని డిమాండ్? చేశారు.

## బిజినెస్

# దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.26,533 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు ఔట్..!




అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తిరిగి ఎన్నికవ్వడం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెలలో ఇప్పటి వరకూ దేశీయ స్టాక్ మార్కె నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) రూ.26,533 కోట్ల విలువైన పెట్టుబడులు ఉపసంహరించారు. దేశీయ కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాలు అంతంతే ఉండటంతోపాటు చైనా మార్కెట్లలో పెట్టుబడుల దిశగా విదేశీ ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తున్నది. అక్టోబర్ నెలతో పోలిస్తే ఈ నెలలో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు తక్కువగా రూ. 94,017 కోట్ల పెట్టుబడులు ఉపసంహరించారు. ఓవరాల్‌గా ఇప్పటి వరకూ విదేశీ పోర్ట్ ఫోలియో పెట్టుబడులు నికరంగా రూ.19,940 బయటకు వెళ్లిపోయాయి. సెప్టెంబర్ నెలలో దేశీయ మార్కెట్లలో రూ.57,724 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టారు. గత ఏడాది కాలంలో ఇది తొమ్మిది నెలల గరిష్టం. ఈ నెల 22 నాటికి ఎఫ్ పీఐలు రూ.26,533 కోట్ల పెట్టుబడులు విత్ డ్రా చేస్తే గత నెలలో రూ.94,017 కోట్లుగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ విధాన నిర్ణయాలను బట్టి భవిష్యత్ పరిణామాలు ఉంటాయని విశ్లేషకులు చెప్పారు.

## టాప్-8 సంస్థల ఎం-క్యాప్ రూ.1.55 లక్షల కోట్లు వృద్ధి..


### హెచ్డీఎఫ్సీ బ్యాంక్.. టీసీఎస్‌లకు భారీగా లబ్ధి..!




గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈలో టాప్-10 కంపెనీలలో ఎనిమిది కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,55,603.45 కోట్లు వృద్ధి చెందింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) భారీగా లబ్ధి పొందాయి. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నష్టపోయాయి. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 1,536.8 పాయింట్లు (1.98 శాతం), ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 374.55 (1.59 శాతం) పాయింట్లు పెరిగాయి. బీఎస్ఈ సెన్సెక్స్ శుక్రవారం 1961.32 పాయింట్లు (2.52 శాతం) వృద్ధి చెంది 79,117.11 పాయింట్లు పెరిగితే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 557.35 (2.39 శాతం) పుంజుకుని 23,907.25 పాయింట్ల వద్ద స్థిర పడ్డాయి. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.40,392.91 కోట్లు వృద్ధి చెంది రూ.13,34,418.14 కోట్ల వద్ద స్థిర పడింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఎం-క్యాప్ రూ.36,036.15 కోట్లు పెరిగి, రూ.15,36,149.51 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.16,266.54 కోట్లు పుంజుకుని రూ.9,01,866.22 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.16,189.33 కోట్ల లబ్ధితో రూ.7,90,151.83 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13,239.95 కోట్లు పెరిగి రూ.5,74,569.05 కోట్లకు చేరుకున్నది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.11,508.91 కోట్లు పుంజుకుని రూ.5,94,272.93 కోట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.11,260.11 కోట్లు వృద్ధి చెంది రూ.8,94,068.84 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ.10,709.55 కోట్లు పెరిగి రూ.7,28,293.62 కోట్ల వద్ద ముగిసింది.

# అదానీ-హిండెన్ బర్గ్ కేసు..

### అమెరికా అభియోగాలను రికార్డుగా పరిగణించాలని సుప్రీంలో పిటిషన్




గౌతం అదానీ- హిండెన్ బర్గ్ వివాదంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. సౌర విద్యుత్ ప్రాజెక్టులకు ఆమోదం పొందేందుకు భారత్ లోని వివిధ రాష్ట్రాల అధికారులకు ముడుపులిచ్చారన్న ఆరోపణలపై అమెరికా కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. అమెరికా కోర్టులో అభియోగాలను గౌతం అదానీ %-% హిండెన్ బర్గ్ కేసులో రికార్డులుగా పరిగణించాలని పిటిషనర్ కోరారు. అమెరికా కోర్టులో అభియోగాలకు గౌతం అదానీ- హిండెన్ బర్గ్ కేసుకు సారూప్యత ఉందన్నారు. అమెరికా కోర్టులో అభియోగాల నమోదుతో 'అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడిందని వెల్లడిస్తుంది. ఈ ఆరోపణలు తీవ్రమైనవి. జాతి ప్రయోజనాల రీత్యా భారత దర్యాప్తు సంస్థలు కూడా దర్యాప్తు చేపట్టాలి' అని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్న సెబీ కూడా సమగ్ర నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఐపీఎల్ వేలంలో రికార్డు ధర పలికిన రిషబ్ పంత్.. అయ్యర్‌కు కూడా భారీ ధర




ఐపీఎల్ 2025 మెగా వేలంలో భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ రికార్డు ధర పలికాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు పంత్ అమ్ముడుపోయాడు. లక్నో టీమ్ పంత్‌ను రూ.27 కోట్లకు కొనుగోలు చేసింది. దాంతో ఐపీఎల్ 2024 టైటిల్ విన్నింగ్ టీమ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ రికార్డు బద్ధలైంది. పంత్ కంటే ముందు శ్రేయాస్ అయ్యర్‌ను పంజాబ్ కింగ్స్ టీమ్ రూ.26.75 కోట్లకు దక్కించుకుంది. శ్రేయాస్ అయ్యర్ కోసం పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు పోటీపడ్డాయి. వేలం రూ.7.5 కోట్లు దాటిన తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ పోటీలోకి వచ్చింది. రెండు జట్లు ధర పెంచుకుంటూ పోయాయి. దాంతో ఐపీఎల్ వేలంలో రూ.20 కోట్ల మార్క్ దాటిన తొలి భారత ప్లేయర్‌గా శ్రేయాస్ అయ్యర్ రికార్డు నెలకొల్పాడు. ఐపీఎల్ 2024లో మిచెల్ స్టార్క్ రూ.24.75 కోట్లు ధర పలికి అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డు క్రియేట్ చేశాడు. ఇప్పుడు ఆ రికార్డును శ్రేయాస్ అయ్యర్ బద్దలు కొట్టాడు. ఐపీఎల్‌లో రూ.25 కోట్ల మార్కు దాటిన మొదటి ఆటగాడిగా కూడా అయ్యర్ రికార్డు నెలకొల్పాడు. చివరికి పంజాబ్ కింగ్స్ జట్టు శ్రేయాస్ అయ్యర్‌ను రూ.26.75 కోట్లకు దక్కించుకుంది. దాంతో స్టార్క్ రికార్డు బద్ధలైంది. ఆ తర్వాత కాసేపటికే శ్రేయాస్ అయ్యర్ రికార్డును రిషబ్ పంత్ బద్ధలు కొట్టాడు. కాగా, ఈసారి వేలంలో మిచెల్ స్టార్క్ ధర ఘోరంగా పడిపోయింది. గత ఐపీఎల్‌లో రూ.24.75 కోట్ల ధర పలికిన స్టార్క్ ఈసారి 11.75 కోట్లకు అమ్ముడు పోయాడు.

## వేలంలో అమ్ముడు పోని పడిక్కల్.. డేవిడ్ వార్నర్.. కారణమిదేనా..?




భారతీయ క్రికెట్ అభిమానులకు కన్నుల పండువగా నిలిచే ఐపీఎల్.. ఐపీఎల్ ఫ్రాంచైజీలు జట్ల ఎంపిక కోసం జరిగే వేలం అంటే అంతే క్రేజీ. ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో ప్రతి ఏటా ఆశ్చర్యకర ఘటనలు నమోదు చేసుకుంటూనే ఉన్నాయి. అన్ క్యాప్డ్ ప్లేయర్ మీద అసాధారణ మొత్తం చెల్లిస్తుంటాయి ఫ్రాంచైజీలు. కానీ అనుభవం గల ప్లేయర్ మాత్రం అమ్ముడు పోక పోవడం విచిత్రంగా ఉంటుంది. ఐపీఎల్ 2025 కోసం ఆదివారం సౌదీ అరేబియా రాజధాని జెడ్డాలో జరిగిన తొలి రోజు వేలం కూడా అందుకు భిన్నంగా ఏమీ లేదు. టీం ఇండియా ప్లేయర్ దేవ్ దత్ పడిక్కల్ కోసం ఏ ఫ్రాంచైజీ బిడ్ దాఖలు చేయలేదు. లెఫ్ట్ హ్యాండ్ టాప్ ఆర్డర్ బ్యాటర్ పడిక్కల్.. ప్రస్తుతం టీం ఇండియాకు ప్రాతినిధ్యం వహించట్లేదు కానీ.. దేశవాళీ క్రికెట్ లో కర్ణాటకకు ఆడుతున్నాడు. ఈ 24 ఏండ్ల కుర్రాడు ఐపీఎల్ టోర్నీలో 1500కి పైగా పరుగులు చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ 123 పరుగులు. గత సీజన్ లో లక్నో సూపర్ జెయింట్స్, 2023లో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలకు ఆడాడు. 200లకు పైగా పరుగులు చేసిన అతడికి 2020, 2021 బెస్ట్ సీజన్లుగా నిలిచాయి. ప్రస్తుత వేలంలో అత్యధికంగా రిషబ్ పంత్ రూ.27 కోట్లు, శ్రేయాస్ అయ్యర్ రూ.26.75 కోట్లు పలికారు. కానీ రిషబ్ పంత్, శ్రేయాస్ అయ్యర్ మాదిరిగా స్టార్ ప్లేయర్ అయినా దేవ్ దత్ పడిక్కల్ మాత్రం ఎంపిక కాలేదు. ఈ సీజన్‌లో ఎంపిక కానీ పడిక్కల్ ఒక్కడే కావడం గమనార్హం. 2009 నుంచి ఐపీఎల్ లో భాగస్వామిగా ఉన్న డేవిడ్ వర్నర్ రెండు టీంలకు ఆడాడు. తొలుత ఢిల్లీ క్యాపిటల్స్, తర్వాత సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. మూడుసార్లు ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న వార్నర్.. 2016లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సారధిగా ఐపీఎల్ టైటిల్ తెచ్చి పెట్టాడు. ఐపీఎల్ లో బుల్ గా చెప్పుకునే వార్నర్ 6565 పరుగులు చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ 140 పరుగులు.

## స్పోర్ట్స్

## టెస్టుల్లో కోహ్లీ 30వ సెంచరీ.. ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్




బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో ఆస్ట్రేలియా ముందు భారత్ భారీ లక్ష్యాన్ని ఉంచింది. రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 487 పరుగుల వద్ద భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఆస్ట్రేలియాకు 533 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం లక్ష్యచేధన కోసం బరిలో దిగిన ఆస్ట్రేలియా ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. బుమ్రా బౌలింగ్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్ నాథన్ మెక్ స్వీని ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. అంతకుముందు మూడో రోజు ఆట మొదలవగానే భారత ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ తమ నిలకడైన ఆటను కొనసాగించారు. అయితే కాసేపటికి తన వ్యక్తిగత స్కోర్ 77 పరుగుల వద్ద కేఎల్ రాహుల్ ఔటయ్యాడు. ఆ తర్వాత జైస్వాల్ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. తర్వాత ఆటలో దూకుడు పెంచి 161 పరుగులకు చేరుకున్న తర్వాత ఔటయ్యాడు. జైస్వాల్ ఔట్ తర్వాత పంత్, ధ్రువ్ జురేల్ వెంటవెంటనే ఔటయ్యారు. విరాట్ కోహ్లీ నిలదొక్కుకుని వాషింగటన్ సుందర్ (29), నితీష్ రెడ్డి (38 నాటౌట్) సహకారంతో పరుగుల వరద పారించాడు. మొత్తానికి 145 బంతులను ఎదుర్కొని టెస్టుల్లో తన 30వ సెంచరీని సాధించాడు. అంతకుముందు కేఎల్ రాహుల్ ఔటవగానే క్రీజులోకి వచ్చిన పడిక్కల్ (25) కుదురుకుంటున్నట్లే కనిపించినా కొద్దిసేపటికే ఔటయ్యాడు.